కుల్లప్తంగా

రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: రేషన్ సరుకుల పంపిణీలో ఎండీయూ అపరేటర్లు, డీలర్లు పారదర్శకత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను శనివారం చైర్మన్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రతి కార్డుదారునికి రేషన్ అందచేయాలన్నారు. తూకంలో తేడాలు వచ్చినా కొలతలు సక్రమంగా లేకపోయినా, కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందించే సరుకులన్నింటినీ ఇవ్వాలన్నారు. పంపిణీలో అవకతవలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మండలం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌గా సువర్ణ బాధ్యతల స్వీకరణ

వెలిగండ్ల: తహసీల్దార్‌గా ఎం సువర్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎం సువర్ణ దొనకొండ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వెలిగండ్లకు కేటాయించారు.

కందుకూరు: కందుకూరు తహసీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా కందుకూరుకు నూతన తహసీల్దార్‌గా ఇక్బాల్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కందుకూరు తహసీల్దార్ పోస్టు దాదాపు ఏడాది కాలంగా ఖాళీగా ఉంది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌తో నెట్టుకొస్తున్నారు. నూతన తహసీల్దార్ నియామకం జరిగిన నేపథ్యంలో ఇబ్బందులు తప్పుతాయనే భావిస్తున్నారు. అదే సందర్భంలో కందుకూరు సబ్‌కలెక్టర్ టీఏగా టి. శ్రీనివాసులు నియమితులయ్యారు.

రోడ్డుపై ఉన్న మెట్ల తొలగింపు

సింగరాయకొండ: హైకోర్టు ఆదేశాలంటూ గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డుపైకి వచ్చిన ఆదాం ఇంటి మెట్లను తొలగించిన సంఘటన శనివారం మండల కేంద్రంలోని బాలయోగినగర్‌లో జరిగింది. ఈ మెట్ల తొలగింపు కార్యక్రమంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడం విశేషం. జేసీబీతో ఈమెట్లను తొలగించారు. ఈఓ రామకోటయ్య పర్యవేక్షించారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం

టంగుటూరు: పొగాకు రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అయిన జనుము, జీలుగు, పిల్లిపెసర, నువ్వులు తదితర నాటి కలియదున్నితే భూమి సారవంత అవుతుందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో పొగాకు రైతులకు శనివారం సమావేశం నిర్వహించారు. బోర్డు అనుమతించిన పరిధిలోనే సాగు చేయాలన్నారు.

కరేడు నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరించాలి

ఉలవపాడు: సింగరాయకొండ-కరేడు నైట్ హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కరేడు గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఈ బస్సు సర్వీసును నిలుపుదల చేశారు. 30 ఏళ్లుగా నడిచిన ఈ బస్సు సర్వీసును నిలుపుదల చేయడం బాధాకరమని అంటున్నారు. ప్రతి రోజూ కరేడు నుంచి కూరగాయలు ఉదయం 5 గంటలకు సింగరాయకొండకు తీసుకుని వెళ్లి అమ్ముకుంటారు. వీరికి, బయట గ్రామాలకు వెళ్లే వారికి ఈ బస్సు ఎంతో ఉపయోగంగా ఉండేదని, దీన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

కందుకూరు: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం నరశింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం స్కూల్‌లో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు చెందిన కె. జోయల్ సుధాకర్, కె.కేతన్, బి. రామకృష్ణలు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి ఏడాదికి రూ.12వేల చొప్పున ఐదేళ్లకు రూ.60వేల స్కాలర్‌షిప్ వస్తుందని వివరించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు షేక్ సంధాని బాష, ఎం రమణయ్య, ఎస్ విప్రనారాయణ, ఐ శ్రీనిధి, పి. బాపయ్య, సరస్వతి, పి.మురళీకృష్ణ, పి.ప్రసాదరావు, డి.సుధాకర్‌లను అభినందించారు. ముగ్గురు విద్యార్థులు పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. స్టాఫ్ సెక్రటరీ తల్లపనేని శ్రీనివాసులు, ఎస్ మాధవరెడ్డి, వై మహల్యారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు, కె.రాంబాబు, ఎస్డీ జిలానీబాష, ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కూలీ పడేదెప్పుడో..
కడుపు నిండేదెప్పుడు..?



గాయంవారిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలంలో జాబ్‌కార్డుదారులు:	7900
పనిచేసిన కుటుంబాలు:	5424
పనిచేసిన కూలీలు:	9400
కూలీలకు అందాల్సిన బకాయి:	రూ.25 లక్షలు

- ఉపాధి కూలి అందక కూలీల ఇక్కట్లు
- మండలంలో రూ.25 లక్షల మేర కూలీ బకాయిలు
- 13 వారాలకు అందాల్సిన కూలి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హనుమంతునిపాడు: గ్రామాల్లో ఇప్పటికీ వ్యవసాయం తరువాత అండగా ఉంటోంది గ్రామీణ ఉపాధి పథకం పనులే. కానీ రెండు నెలలుగా ఉపాధి కూలీ నగదు పడకపోవడంతో ఏ రోజుకారోజు కూలీనాలి చేసుకొని జీవనం సాగించే కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఓ పక్క బకాయిలు అందక, మరో పక్క కూలీ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉపాధి 7900 మందికి జాబ్ కార్డులున్నాయి. వారిలో ఈ ఏడాది 5424 కుటుంబాలకు 23 వారాలు పని కల్పించారు. 9400 మంది కూలీలు పనిచేశారు. వారిలో కొన్ని శ్రమ శక్తి సంఘాల ఉపాధి కూలీలకు పైసా కూడా బిల్లులు రాలేదు. కొన్ని గ్రామాల్లో 10 వారాలకు మాత్రమే ఉపాధి బిల్లులు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. 13 వారాలకు ఉపాధికూలీల బిల్లులకు రూ.26 లక్షల వరకు బకాయిలున్నాయి. మండుటెండలో కష్టపడి పని చేసిన నేటికీ బిల్లుల రాక పోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వారానికి ఉపాధి కూలీల బిల్లులు బ్యాంక్‌లో జమయ్యేయని కూలీ చెప్తున్నారు. ఈ ఏడాది ఉపాధి కూలీలు పని చేసిన పని దినాలకు ఇంకా బిల్లులు రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీల బిల్లులు బకాయిలు వెంటనే చెల్లింపులు చేయాలని కూలీలు రాజారావు, సుందరం, కె.నారాయణలు, తదితులు కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం



పొన్నలూరులో తల్లిపాలపై అవగహన కల్పిస్తున్న అధికారులు



లింగసముద్రంలో తల్లిపాల వారోత్సవాలు



బొట్లగూడూరులో తల్లిపాల ఆవశ్యకతపై వివరిస్తున్న సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ

కనిగిరి రూరల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి క్లస్టర్ పరిధిలో తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ పార్వతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రు పాలు ఇవ్వాలన్నారు. అది శిశువుకు తొలి టీకాల పనిచేస్తోందని తెలిపారు. తల్లి పాలు ముద్దు- బుడ్డి పాలు వద్దు. తల్లి పాలు అమృతం- బుడ్డిపాలు విషం, తల్లి పాలనిద్దాం- బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుదాం అని నినాదాలతో ర్యాలీ చేశారు.

పామూరు: తల్లిపాలు బిడ్డకు ప్రాణాధారమని, ప్రతి బాలింత శిశువుకు ముర్రుపాలు పట్టించడంవల్ల వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పామూరు సెక్టార్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని బొట్లగూడూరు, అపమాం బాపూరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ బాలింతలు అపోహలు వదలి ప్రసవం అయిన తరువాత బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, దీంతో వ్యాధులు దరిచేరవన్నారు. పామూరు ఎర్రచేలు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఈఓ బ్రహ్మానందం, పెరుగు శ్రీధర్, వంకేశ్వరం వెంకట నాగవాణిలు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై వివరించి ర్యాలీ నిర్వహించారు.

తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యం

పొన్నలూరు: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మాధవీలత అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టి పంచాయతీలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాధవిలత మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలకు ముర్రుపాలు తాగించడం వలన చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. ప్రసవించిన వెంటనే తల్లి మొదటి సారి ముర్రుపాలును శిశువుకు తాపాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని తీసుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎంపీడీఓ కల్పన, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల కె. అనూరాధ, గౌసియా, మధురవాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగసముద్రం: తల్లిపాలే బిడ్డకు సంజీవని అని సెక్టార్ సూపర్‌వైజర్ రాధాదేవి అన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎన్‌ఎం పార్వతి వివరించారు.

వలేటివారిపాలెం: మండలంలోని పోలినేనిపాలెం అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్లు అరుణ, కృష్ణకుమారి, అంగన్వాడీ హెల్పర్లు అమీనా, మల్లేశ్వరి, తదితరలు పాల్గొన్నారు.

నీట్‌లో 634వ ర్యాంక్



కిరణ్మయికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సింగరాయకొండ: మూలగుంటపాడు పంచాయతీకి చెందిన విద్యార్థిని ఆలూరు కిరణ్మయి నీట్ ఫలితాల్లో 634వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటుకుంది. పలువురు ఆమెకు శనివారం అభినందనలు తెలిపారు. 720 మార్కులకు 651 మార్కులు సాధించింది. ఇంటర్ బైపిసిలో 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు పొందింది. కిరణ్మయి తండ్రి గిరిబాబు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి శాంతి గృహిణి. న్యూరాలజీలో పీజీ చేయటమే తన లక్ష్యమని కిరణ్మయి వివరించింది.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని అంగిరేకుల పాడు ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీ జరిగే పాఠశాల యాజమాన్య కమిటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈఓ బి. నాగేంద్రవదన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 8వ తేదీ జరిగే ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులను సమాయత్త పరచాలని వారికి ఎన్నికలపై అవగాహన కల్పించాలని, విధివిధానాలను తెలియజేయాలని సూచించారు.

58 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

కనిగిరి రూరల్: చాకిరాల సమీపంలో ఓ పౌల్ట్రీ ఫాంలో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. సుమారు 161 బ్యాగులు (57.90 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడుల్లో ఒంగోలు, పొదిలి, దొనకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల అధికారులు పాల్గొన్నారు. కోళ్లకు దాణాగా వేసేందుకు ఈ బియ్యం స్టాక్ ఉంచినట్లు సంబంధిత వ్యక్తులు అధికారులకు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర రూ. 358

కొండపి (సింగరాయకొండ): స్థానిక వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ. 358 పలికిందని వేలం నిర్వాణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డ్ పరిధిలోని నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1235 బేళ్ళు వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 1126 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 109 బేళ్ళను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 358, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 281.93 పలికింది. వేలంలో 18 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు రైతులు మోసపోవద్దు

టంగుటూరు: ప్రస్తుత పొగాకు మార్కెట్ చూసి రైతులు మోసపోవద్దని.. ఎక్కువ మొత్తంలో సాగు చేయవద్దు అని వేలం నిర్వహణాధికారి తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 855 బేళ్ళను వేలాని తీసుకువచ్చారు. గరిష్ట ధర రూ. 359 పలకగా, కనిష్ట ధర రూ. 205 పలికింది.

డిగ్రీ ఫలితాల్లో ఎంఎస్‌ఎం విద్యార్థుల ప్రతిభ



లక్ష్మీ ఇంద్రాణి



ఎస్‌కే నస్రీన్



రాజ్‌కుమార్



ఎస్‌కే కాకర్ల సల్మా

కనిగిరి రూరల్: ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఫస్ట్ ఇయర్ సెకండ్ సెమిష్టర్ ఫలితాల్లో ఎంఎస్‌ఎం విద్యార్థులు ప్రతిభను చాటారు. ఫస్ట్ బీఎస్సీ బాటనీలో చెరుకూరి లక్ష్మీ ఇంద్రాణి 400 మార్కులు, కోలా మెరీనా 399 మార్కులు సాధించారు. ఫస్ట్ బీఎస్సీ కంప్యూటర్స్‌లో ఎస్‌కే నస్రీన్ 376 మార్కులు, కిన్నెర స్వాతి 371 మార్కులు సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో యర్రబల్లి రాజ్‌కుమార్ 343, బండారు వైష్ణవి 337 మార్కులు సాధించారు. బీబీఏలో పున్నం నరేష్ 316 మార్కులు సాధించారు. బీబీఏ లో ఎస్‌కే కాకర్ల సల్మా టౌన్ టాప్ సాధించింది. బీఏ స్పీ వీవోసీలో బద్దెపూడి నేహా దాస్ 297/350 మార్కులతో టౌన్ ఫస్ట్ నిలిచినట్లు కరస్పాండెంట్, డైరెక్టర్లు ఏలూరి సుబ్బారావు, నరేన్ చౌదరిలు వెల్లడించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సింగరాయకొండ: విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తిరుమలరావు, ఏఎస్ఓ శ్రీనివాసరావులకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. జీఓ 117 ను రద్దు చేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, పరీక్ష విధానం అమలు చేయాలని కోరారు.

లెప్రసీ సర్వే పూర్తి చేయాలి

మర్రిపూడి: ఈ నెల 10వ తేదీలోపు లెప్రసీ సర్వే పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి సురేష్ తెలిపారు. శనివారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వ్యాక్సిన్ నిల్వలు, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాన్పుల గదులు, వార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లెప్రసీ కేసులు గుర్తించి వైద్యశాలకు పంపాలన్నారు. ప్రత్యేకంగా గర్భిణులకు వ్యాక్సిన్ ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

45 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో శనివారం 104 వాహనం ద్వారా ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో డాక్టర్ సందీప్ కుమార్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య హెల్త్ సెంటర్ల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని 6,10 తరగతి బాలబాలికలకు టీడీ ఇంజక్షన్లు వేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

కనిగిరి రూరల్: పట్టణంలోని ఐకిడ్స్ పాఠశాలలో స్నేహితుల దినోత్సవ ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్‌కే రజియా, షరీఫ్‌లు విద్యార్థులకు స్నేహితుల దినోత్సవ విశిష్టతను తెలిపారు. ఫ్రెండ్‌షిప్ బాండ్లు, స్వీట్లు అందచేశారు. విద్యార్థులంతా పరస్పర సహకారంతో.. కలిసి మెలిసి చదువుకుని, మంచి విలువ పాటించాలని తెలిపారు. తోటి వారికి సాయం చేయాలనే దృక్పథాన్ని కల్గి ఉండాలని వివరించారు.



సింగరాయకొండ: దుంపా దశదినకర్మ కార్యక్రమంలో డాక్టర్ సురేష్

దశదినకర్మ కార్యక్రమంలో ప్రముఖులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో శనివారం జరిగింది. మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర రావు, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనిల్‌కుమార్‌రెడ్డిని పరామర్శించి వెంకట సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పాడిబండ్ల నాగేశ్వరరావు, సింగరాయకొండ, టంగుటూరు పార్టీ అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, మల్లవరపు రాఘవరెడ్డి, పిన్నిక శ్రీనివాసులు, కొమ్మాలపాటి మధుసూదనరావు, చుండి శ్రీనివాసులు, చుండూరి సురేష్, పల్లా అనూరాధ, చింతల వెంకటేశ్వర్లు, నాగినేని భాస్కర్, శంకరరెడ్డి,మాలె రంగారెడ్డి, సర్పంచ్ కె. పున్నారావు, కొండూరి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరి రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ నల్సా పథకం ప్రొటక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ట్రైబల్ రైట్స్‌లో భాగంగా గిరిజన ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.సృజన, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉచిత వైద్య శిబిరంలో 284 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఎస్పీ రత్నాకరం రామరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్చాల ఆది నరసారెడ్డి, మాజీ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, న్యాయవాది సుమైర్, వైద్యులు ప్రియార్ష నందా, ఫణీ, ఆయోషా, స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంద్రు రమేష్, నవకుమార్, సూపర్ వైజర్లు మల్లేశ్వరి, డీపీఎం కె.ప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మ భౌతికకాయానికి దద్దాల నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణయాదవ్, కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: మండలంలోని గురువాజీపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, వార్డు మెంబర్ కుమ్మరికుంట అంకమ్మ భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంకమ్మ మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్ కుమ్మరకుంట సౌందర్య రవి, ఎంపీటీసీ మాలకొండయ్య, వీర నాగిరెడ్డి, సర్పంచ్‌లు తిరుపతయ్య, వెంకటరెడ్డి, పాశం కొండయ్య, రైతు సంఘ అధ్యక్షుడు పొలక సిద్ధారెడ్డి, మాజీ ఎంపీటీసీ పేతురు, నాయకులు దాదిరెడ్డి మాలకొండారెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి పూర్ణిమా దేవి

సింగరాయకొండ: పేదలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. పూర్ణిమదేవి అన్నారు. మండల కేంద్రంలోని సుందర్‌నగర్ గిరిజన కాలనీలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులకు ఉచితంగా వైద్యం అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని, గిరిజనుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు చదువు మధ్యలో మానకుండా ఉన్నత చదువులు చదవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, సీనియర్ వ్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు, ప్రభుత్వ డాక్టర్లు చైతన్య కృష్ణ, డాక్టర్ ధీరేంధర్ కుమార్, ఎంపీడీఓ నాగేష్‌కుమారి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హరి కోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి సంపత్, ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఎస్సై టి. శ్రీరాం పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.6,94,971

వలేటివారిపాలెం: మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆదాయం రూ.6,94,971 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కుంకుమార్చన రూ.20,040, తలనీలాలు రూ.28,450, ప్రత్యేక దర్శనం రూ.1,52,600, లడ్డుప్రసాదాలు రూ.1,68,040, అన్నదానం రూ.2,85,841, రూమ్‌అద్దెలు రూ.27,910 వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కందుకూరు: పట్టణంలోని క్లబ్ రోడ్డు నుంచి ఆదియేంద్ర కాలనీ వరకు నూతనంగా తారు రోడ్డు నిర్మించేందుకు రూ.1.26కోట్ల పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం భూమిపూజ చేశారు. క్లబ్ నుంచి ఆదియేంద్ర కాలనీ వరకు రూ 16.65 లక్షలతో తారురోడ్డు నిర్మాణం, మధ్యలో వాగుపై రూ1.1కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని వర్షం కురిసినప్పుడు నీరు నిల్వ ఉండే 50 ప్రాంతాలను గుర్తించామని, వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతామన్నారు. రాళ్లవాగును పరిశీలించి నీరు వెళ్లేందుకు ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కందుకూరు: స్థానిక టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా 430 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. అలాగే ఈ ఏడాది నుంచి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు సొంతంగా నగదు బహుమతులు అందజేస్తానని హామీ ఇచ్చారు. కాలేజీలో నాలుగు ల్యాబ్‌ల అవసరం ఉందని, కాలేజీ నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మించాలని ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేను కోరారు. పీడీ సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

అసంబద్ధ సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలి

సీఎస్‌పురం(పామూరు): అసంబద్ధ సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలని ఏపీటీఎఫ్ సీఎస్‌పురం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ డిమాండ్‌చేశారు. సర్దుబాటు ఉత్తర్వులు రద్దుచేయాలని కోరుతూ శనివారం ఏపీటీఎఫ్ నాయకులు ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డిగ్రీ, బీఈడీ లేని రేగులచలక, రెడ్డిగారిపల్లి పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను హైస్కూల్‌కు వేస్తే పిల్లలకు ఎలా విద్యాబోధన చేయాలని వారు ప్రశ్నించారు. సర్‌ప్లస్ కాకున్నా అదే పాఠశాలలో అవసరమైన సీఎస్‌పురం హైస్కూల్ నుంచి ఎలా ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు వేశారని ప్రశ్నించారు. బీఈడీ అర్హత లేకపోయినా చెన్నపునాయునిపల్లె నుంచి వి.బైలు ఉపాధ్యాయునికి హైస్కూల్ సర్దుబాటు ఎలా చేశారో చెప్పాలన్నారు. సర్‌ప్లస్ కాని పాఠశాలలు వి.బైలు, ముళ్లపాడు, సీఎస్‌పురం ఎస్టీ పాఠశాలల నుంచి ఎందుకు డిప్యూటేషన్ వేశారని, ఏ నిధదనలు పాటించారన్నారు. సర్‌ప్లస్ కాకపోయినా, అర్హత లేకపోయినా కోవిలంపాడు స్కూల్ నుంచి హైస్కూల్‌ప్లస్‌కు వేసిన సర్దుబాటు ఉత్తర్వులు కూడా రద్దుచేయించాలని వారు కోరారు. డి.సుబ్బారాయుడు, కే.చన్నయ్య, జి.రామకృష్ణ, బీ.చిన్ననారాయణ, హమాద్ పాల్గొన్నారు.